www.prajasakti.com
ప్రజాశక్తి
5
సోమవారం 5 ఫిబ్రవరి 2024
తిరుపతి



ఈవీఎంలు, స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్

పలు భవనాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జేసీ శ్రీ శుభం బన్సల్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలు 2024 నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, కౌటింగ్ కేంద్రంగా వినియోగించుటకు శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలోని పలు భవనాలను కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తదితర భవనాలను అందులోని గదులను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, జెసి శుభం బన్సల్‌లతో కలిసి పరిశీలించారు. వీరివెంట తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, ఇంఛార్జి అర్బన్ తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఆర్ఎస్ డిటి రామచంద్ర రెడ్డి ఉన్నారు.

తిరుమలలో రద్దీ

దర్శనానికి 10 గంటలు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఒక్కరోజే సాయంత్రం వరకు శ్రీవారిని 54 వేల మంది భక్తులు దర్శించుకోగా అంతే స్థాయిలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం నిరీక్షిస్తున్నారు. భక్తులు అందించిన కానుకలు ద్వారా శ్రీవారికి హుండీకి రూ.3.15కోట్లు ఆదాయం సమకూరింది. స్వామిని దర్శించుకునేందుకు 24 కంపార్టమెంట్లలో భక్తులు నిరీక్షిస్తున్నారు. శ్రీవారి దర్శనానికి పది గంటలు సమయం పడుతోంది. గడిచిన రెండు, మూడు రోజులు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో తిరుమల కొండ రద్దీగా మారింది. భక్తులు ఇబ్బందులు పడకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులు నీళ్ల సదుపాయంతోపాటు చిన్నారులకు అవసరమైన పాలు అందిస్తున్నారు. మరో రెండు రోజులు భక్తుల రద్దీ కొనసాగే అవకాశముందని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు.

హిందూ ధర్మంలోకి ఇతర మతస్తులకు స్వాగతం

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుమల: మానవులు ధర్మబద్ధంగా జీవించాలని తెలిపే హిందూ సనాతన ధర్మం ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన మత విశ్వాసమని, ఈ ధర్మాన్ని ఆచరించేందుకు తమకు తాముగా, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ఇతర మతాలకు చెందిన వారిని స్వాగతిస్తున్నామని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన ధార్మిక సదస్సులో ఛైర్మన్ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా హిందూధర్మం పట్ల అపారమైన గౌరవం, విశ్వాసం గల ఇతర మతాల వారిని ఆహ్వానించేందుకు తిరుమలలో తగిన ఏర్పాట్లు చేయాలని టీటీడీ యోచిస్తున్నట్లు చెప్పారు. ఇతర మతాల భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే శ్రీ వేంకటేశ్వరస్వామివారి పాదకమలాల వద్ద హిందూ ఆచారాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ధార్మిక సదస్సులో పాల్గొన్న పీఠాధిపతులందరూ ఈ విషయాలను అభినందించారు.

శ్రీవారి ఆశీస్సులతో ధార్మిక సదస్సు విజయవంతం

57 మంది పీఠాధిపతులు, మఠాధిపతులు విచ్చేశారు
టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డి

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల ఆస్థాన మండపంలో జరుగుతున్న ధార్మిక సదస్సుకు 57మంది స్వామీజీలను ఆహ్వానించగా అందరూ ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుగ్రహభాషణం అందించారని, ఈ విధంగా సదస్సు విజయవంతమైందని టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డి తెలిపారు. సదస్సు రెండోరోజు ఆదివారం సాయంత్రం ఈవో మాట్లాడుతూ నభూతో నభవిష్యతి అన్నట్టుగా ధార్మిక సదస్సు జరిగిందన్నారు. ధార్మిక సదస్సుకు స్వామివారి ఆశీస్సులు చక్కగా ఉన్నాయనడంలో సందేహాలు లేదన్నారు. సదస్సులో శనివారం 24 మంది మహనీయులు, ఆదివారం 17 మంది మహనీయులు ప్రత్యక్షంగా, 16 మంది వర్చువల్‌గా తమ సూచనలు, సలహాలు ఇచ్చారని వివరించారు. మఠాధిపతులు, పీఠాధిపతులు తమ కీలక సలహాలు, సూచనలిచ్చి టీటీడీకి దిశానిర్దేశం చేశారని చెప్పారు. మహనీయుల ఉపన్యాసాలను రికార్డ్ చేశామని, వీటిని తీర్మానాలుగా చేసి రేపటి రోజున మఠాధిపతులు, పీఠాధిపతులు సమక్షంలో మీడియా ప్రతినిధుల ముందు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ప్రవేశపెడతారని తెలిపారు. వచ్చే బోర్డు సమావేశంలో వీటిని ఆమోదించి టీటీడీ తదుపరి కార్యాచరణ చేపడుతుందని వెల్లడించారు.

మారుమూల గ్రామాలకు ధర్మప్రచారం

ధార్మిక సదస్సులో వర్చువల్‌గా స్వామీజీల అనుగ్రహ భాషణం



వర్చువల్ గా ఆన్ లైన్ లో పాల్గొన్న పండిట్ రవిశంకర్

ప్రజాశక్తి- తిరుమల: మారుమూల గ్రామాలకు ధర్మప్రచారాన్ని వ్యాప్తి చేయాలని, ఘర్ వాపసి లాంటి కార్యక్రమాల ద్వారా మతం మారిన వారిని తిరిగి ఆహ్వానించాలని పలువురు స్వామీజీలు అనుగ్రహ భాషణం చేశారు. తిరుమల ఆస్థాన మండపంలో జరుగుతున్న ధార్మిక సదస్సులో రెండోరోజైన ఆదివారం మధ్యాహ్నం పలువురు స్వామీజీలు వర్చువల్‌గా పాల్గొన్నారు. శ్రీ రవిశంకర్ గురూజీ మాట్లాడుతూ సనాతన ధర్మ వ్యాప్తికి తిరుమల తిరుపతి దేవస్థానం విశేషంగా కృషి చేస్తోందన్నారు. అందుకుగాను బోర్డు అధ్యక్షులకు, ఈవోకు ధన్యవాదాలు తెలిపారు. యువతను ధర్మం వైపు నడిపించాల్సిన సమయం ఆసన్నమైందని, ధర్మ పరిరక్షణలో యువత ప్రాధాన్యత ఎంతో ఉందని అన్నారు. గ్రామాలలో పూజారులకు వైదిక పూజాకార్యక్రమాల విషయంలో శిక్షణ ఇవ్వవలసిన ఆవశ్యకత ఉందని, పట్టణాలు, గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో జానపద గీతాలు, యక్షగానం, భజనలు, కీర్తనల ద్వారా విస్తృతంగా ధర్మప్రచారం జరిగేలా టిటిడి చర్యలు తీసుకోవాలన్నారు. పుష్పగిరి మఠంకు చెందిన విద్యాశంకర భారతి స్వామి మాట్లాడుతూ యజ్ఞాలు, పూజా కార్యక్రమాలు, ఆలయాలు పెరుగుతున్నాయని, సంప్రదాయాల పరిరక్షణ కోసం అందరూ పనిచేయాలన్నారు. టీటీడీ అద్భుతమైన ధార్మిక కార్యక్రమాలను చేపడుతోందని, ఈవిషయంలో ఛైర్మన్ కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి కృషి చాలా ఉందన్నారు. ధార్మిక సదస్సులో తీసుకున్న నిర్ణయాలు అమలుపరచాలని కోరారు. కంచి కామకోటి పీఠం శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ టీటీడీ నిర్వహిస్తున్న ధర్మ కార్యక్రమాలు చాలా బాగున్నాయన్నారు. టీటీడీ సహకారంతో ఎన్నో సేవా, ధార్మిక కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాది మఠం, శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ, అహోబిల మఠం, శ్రీవన్ శఠగోప శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి, మైసూరు, దత్త పీఠం, శ్రీ విజయదత్తానంద స్వామీజీ, ఉత్తరాధికారి, ఉడుపి, అదమారు మఠం, శ్రీ ఈశప్రియ తీర్థ స్వామీజీ, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సులు ప్రారంభం

మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్‌లను ప్రారంభించిన టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రపంచ క్యాన్సర్ దినం 2024 పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ప్రాజెక్టును తిరుపతి జిల్లా నుండి క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఆవరణలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సులను రెండింటిని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలోని ప్రజలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని టీటీడీ ఛైర్మన్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ఎంపీ మద్దిల గురుమూర్తి, జేఈఓ సదాభార్గవి, టీటీడీ పాలక మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి, స్విమ్స్ డైరెక్టర్ విసి ఆర్‌వి కుమార్, స్పెషల్ ఆఫీసర్ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజి జయచంద్రా రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. టీటీడీ ఛైర్మన్ మాట్లాడుతూ స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా మెడికల్ కాలేజీకి రెండు అత్యాధునిక పరికరాలు గల మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ బస్సులను దాతలు విరాళంగా ఇచ్చిన వాటిని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలు ఈ వాహనాలు వారి గ్రామాలకు వచ్చినప్పుడు క్యాన్సర్ అనుమానితులు పరీక్షలు చేయించుకోవాలని, ఈ వాహనంలో సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని, ఊపిరితిత్తులకు, ఇతర సంబంధ క్యాన్సర్ అనుమానితులను స్విమ్స్ హాస్పిటల్ కు రెఫెర్ చేయబడుతుందని తెలిపారు. టీటీడీ సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి, ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, స్విమ్స్ సూపరింటెండెంట్ రామ్, జగనన్న ఆరోగ్య సురక్ష నడల అధికారిని తేజేశ్వరి, డిపిఎమ్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాలువల్లో రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

కమిషనర్ అదితి సింగ్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరపరిధిలో కాలువల్లో, రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ హెచ్చరించారు. ఆదివారం ఉదయం నగరంలోని 18,19, 20 వార్డుల్లో మస్టర్ పాయింట్లను పరిశీలించారు. సీతమ్మ రోడ్డు, మహిళా యూనివర్సిటీ రోడ్డు, ఎస్వీ నగర్ రోడ్డు, ప్రకాశం రోడ్డు, గాంధీ రోడ్డులను పరిశీలించారు. బండ్లను కడిగి రోడ్డుపైకి ఆ నీటిని వదులుతున్న ఓ షాప్ వారికి జరిమానా విధించమని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. టీ షాపు వద్ద టీ కప్పులను బయట పారేసి ఉండడంతో వారికి, కిరాణ షాపు వద్ద చెత్త వేసి వుండడంతో వారికి, పూల మార్కెట్ వద్ద ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండడాన్ని గమనించి వారికి కూడా జరిమానాలు విధించమని ఆదేశాలు జారీ చేశారు. కొన్ని చోట్ల కాలువలు శుభ్రం చేయించాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని, రోడ్లపై వేసిన కంకరను తీసివేయించాలన్నారు. అనంతరం తూకివాకం వద్ద ఉన్నటువంటి ప్లాంట్లను సందర్శించి, ప్లాంట్లు పనితీరును అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ తిరుపతిని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరి పైన ఉందని, కాలువల్లో, రోడ్లపై ఎక్కడ గాని చెత్త వేయరాదని, మునిసిపల్ పారిశుధ్య సిబ్బందికి తడి పొడి చెత్తలను వేరువేరుగా అందించి తిరుపతి పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల మస్టర్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అదితి సింగ్

రోడ్డు భద్రత నిత్యజీవితంలో భాగం కావాలి

ఇంటర్వ్యూ

జి. ఆది నారాయణ, తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి

ప్రజాశక్తి - తిరుపతి: రోడ్డు భద్రత అనేది నిత్య జీవితంలో ఒక భాగం కావాలని తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి జి.ఆదినారాయణ పేర్కొన్నారు. ఇటీవలే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించిన నేపథ్యంలో 'ప్రజాశక్తి'తో పలు విషయాలను ఆయన పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రోడ్డు భద్రత అనేది ప్రతి క్షణం, ప్రతి నిమిషం, ప్రతి రోజూ అవసరమని, దానిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ చైతన్యపర్చేందుకే రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు రవాణాశాఖ తమ వంతుగా కృషి చేస్తోందన్నారు. దేశంలో సంవత్సరానికి ఐదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, తద్వారా లక్షా 40వేల మంది మృతి చెందుతున్నారన్నారు. మూడున్నర లక్షల మంది క్షతగాత్రులవుతున్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయన్నారు.

వాహనదారులు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ముఖ్యంగా తాగి వాహనాలను నడిపే వారి వల్ల, ర్యాష్ డ్రైవింగ్ వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలతో భారీగా ప్రాణనష్టం జరిగే ఆస్కారం ఉంటుందని అన్నారు. కాబట్టి తాగి, ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని తెలిపారు. వాహనడ్రైవర్లు 8 గంటల కంటే ఎక్కువ సమయం వాహనాలను నడపడం వల్ల అలసిపోయి నిద్రలోకి జారుకొని అర్ధరాత్రి 12 నుంచి ఉదయం 6 లోపు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నయని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం భోజనం తర్వాత కనీసం ఒక గంట పాటు డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవాలన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను, సరుకులను ఎక్కించుకోకూడదని చెప్పారు. అలాగే ఎట్టిపరిస్థితుల్లోనూ వ్యతిరేక దిశలో వాహనాలు నడపరాదని, తప్పనిసరిగా ప్రతి డ్రైవరు హెల్త్‌కం అడ్రస్ కార్డును జేబులో ఉంచుకోవాలన్నారు.

హెల్మెట్ ధరించకపోవడం వల్లే 40శాతం మంది యువత రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని, అలాగే మరో 70 శాతం మంది గాయాలపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై ప్రయాణం చేసే వారు విధిగా తప్పనిసరిగా సీట్ బెల్టు, హెల్మెట్ (ఐఎస్ఐ, బిఎస్ఐ) ధరించాలన్నారు. జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రవాణా, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే 36చోట్ల డేంజర్ (బ్లాక్) స్పాట్లను గుర్తించామని, ఆయా చోట్ల ప్రమాదాలు చోటు చేసుకోకుండా,తీవ్రమైన గాయాల శాతం తగ్గించేందుకు, భద్రతా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే మోటారు వాహన చట్టాలను ఉల్లంఘించే వాహనదారులపై కఠినచర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల ముఖ్యలక్ష్యాలు

- పాఠశాలలు, కళాశాలలు, వినియోగదారులకు అవగాహన కల్పించడం, రహదారి భద్రతను ప్రోత్సహించడం.

- సీటు బెల్ట్‌లు, హెల్మెట్‌లు ధరించడంతోపాటు రోడ్డు భద్రతాచర్యలను వర్తింపజేయడం ద్వారా రోడ్డు ప్రమాదాల కారణంగా గాయాలు, మరణాలను తగ్గించడం.

- ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుల ఆధారంగా, సాధారణ భద్రతా చిట్కాలను అనుసరించడం అమలు చేయబడితే రహదారులను సురక్షితం చేయడంలో సహాయపడుతుంది.

- ఎల్లప్పుడూ సురక్షితమైన వేగంతో డ్రైవ్ చేయండి. సగటు వేగంలో ప్రతి 1శాతం పెరుగుదలకు, ప్రాణాంతకమైన క్రాష్ ప్రమాదంలో 4 శాతం పెరుగుదల ఉందని గణాంకాలు సూచిస్తున్నాయి.

- ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు పట్టీ ఉన్న హెల్మెట్ (ఐఎస్ఐ, బిఎస్ఐ ప్రమాణం) ధరించాలి. మంచి నాణ్యమైన హెల్మెట్ ధరించడం వల్ల మరణ ప్రమాదాన్ని 42 శాతం, తీవ్రమైన గాయం తగ్గించవచ్చు.

- గాయాన్ని నివారించడానికి సీటు బెల్ట్ (డ్రైవర్, ప్రయాణీకుడు ఇద్దరూ) ధరించాలి. సీటు బెల్ట్ ధరించడం వల్ల ఫ్రంట్ సీటులో ఉన్నవారిలో గాయాలు, మరణాల ప్రమాదాన్ని 45 నుంచి 50 శాతం, వెనుక సీటులో ఉన్నవారు 25-75 శాతం వరకు తగ్గిస్తుంది.

- పిల్లలను ముందు సీట్లలో కూర్చోబెట్టవద్దు. పిల్లల నిర్బంధంలో పిల్లలను ఉంచడం వలన కనీసం 60 శాతం మరణ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా 4 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు.

- డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఏకాగ్రతకు భంగం కలిగించే మొబైల్ ఫోన్‌లు లేదా ఇతర గాడ్జెట్‌లను ఉపయోగించవద్దు. టెలిఫోన్‌ను ఉపయోగించకుండా డ్రైవర్ ప్రతిచర్య సమయాలు 50 శాతం నెమ్మదిగా ఉంటాయి.

- మూజిక్ సిస్టమ్‌ల వాయిస్ స్థాయి సురక్షితమైన వినగల పరిమితుల్లో వుండేలా చూసుకోవాలి.

- ఇతర వాహన డ్రైవర్లు లేదా పాదచారుల దృష్టిని మరల్చే రహదారిపై అవాంఛిత హారన్‌లను నివారించండి.

- మద్యం తాగి వాహనాలు నడపకూడదు. డ్రైవింగ్ 0.05 కంటే ఎక్కువ రక్తంలో ఆల్కహాల్ గాఢత కలిగి ఉన్నప్పుడు డ్రింక్, డ్రైవింగ్ ప్రమాదాల ప్రమాదాన్ని నాటకీయంగా పెంచుతుంది.

- సురక్షితంగా ఉండటానికి ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన ముఖ్యమైన భద్రతా చర్యలని విధిగా పాటించాలి.

- మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వరాదని, ఒకవేళ మైనర్లు యాక్సిడెంట్ చేస్తే దానికి కారణమైన తల్లిదండ్రులకే శిక్ష విధింపబడుతుంది. అలాగే, పిల్లలకు చిన్న వయస్సులోనే ఈ భద్రతా చర్యలను నేర్పించడం చాలా ముఖ్యం, తద్వారా వారు భవిష్యత్తులో దురదృష్టకర సంఘటనలను నివారించేలా చర్యలు తీసుకోవాలన్న సంకల్పంతో రోడ్డుభద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రపంచ కాన్సర్ డే అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా తిరుపతిలో అవగాహన ర్యాలీని ఆదివారం నిర్వహించారు. క్యాన్సర్ భారిన పడకుండా నివారణ చాలా ముఖ్యమని, వ్యాధిని ముందుగానే గుర్తించి ముదరక ముందే చికిత్స తీసుకోవడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని, క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రపంచ క్యాన్సర్ డే 2024 సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణ బాబు పేర్కొన్నారు. స్విమ్స్ పద్మావతి వైద్య కళాశాల నుండి స్విమ్స్ ఎంట్రన్స్ వాల్మీకి విగ్రహం వరకు క్యాన్సర్ అవేర్నెస్ వాక్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్, సర్జికల్ ఆంకాలజీ స్పెషల్ ఆఫీసర్ జయచంద్రారెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్‌ను నయం చేయడం కష్టమని అందరికీ తెలుసు అని, కానీ కాన్సర్ నివారణ చాలా ముఖ్యం అని, దానిని ముదరకుండా ముందస్తుగా గుర్తించి చికిత్స తీసుకోవడం చాలా అవసరం అని దీనిపై గ్రామ స్థాయి వరకు ప్రజల్లో అవగాహన కల్పించి, వారిని క్యాన్సర్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఆరోగ్య కార్యకర్తపై, మన అందరిపై ఉందని తెలిపారు. తిరుపతి జిల్లాలో టీటీడీ ఎంతో గొప్ప సహకారం అందించి క్యాన్సర్ ట్రీట్మెంట్‌కు స్విమ్స్ పూర్తిస్థాయిలో ఆసుపత్రి అందుబాటులో వస్తున్నందుకు వారికీ మనస్పూర్తిగా ధన్యవాదాలు తెలియచేశారు. మొదటి దఫాగా తిరుపతి, అనకాపల్లి రెండు జిల్లాలో ముందుగా ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అనంతరం వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలలో మంచి ప్రతిభ చూపిన కళాశాల విద్యార్థినులకు ప్రసంశాపత్రాలు అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి, స్విమ్స్ సూపరింటెండెంట్ రామ్, డిపిఎంఒ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో అంబాజీపేట చిత్ర యూనిట్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అంబాజీపేట బ్యాండ్ మేళం చిత్ర యూనిట్ ఆదివారం తిరుపతిలో హల్చల్ చేసింది. స్థానిక ప్రతాప్ థియేటర్‌లో చిత్రప్రదర్శనకు విచ్చేసిన సినిమా బృందం అభిమానులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆ చిత్రం హీరో సుహాష్ మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ విడుదలైన అంబాజీపేట బ్యాండ్ మేళం చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి విజయానందించడం సంతోషం ఉందన్నారు. చిత్రం విజయ యాత్రలో భాగంగా నేడు తిరుపతికి వచ్చామని, కుటుంబ సమేతంగా చూడదగ్గ ఈ ఫ్యామిలీ సినిమాలు, ప్రతిఒక్కరు చూసి ఆదరించాలన్నారు. సినిమా కథానాయికి శివాని మాట్లాడుతూ తిరుపతిలోని అభిమానుల ఆదరణ ఎన్నటికీ మరవలేనన్నారు. కుటుంబ కథాచిత్రమైన అంబాజీపేట బ్యాండ్ మేళం, నేటి యువతను ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ చిత్రన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభిమానులు చిత్ర బృందంతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో ఆ చిత్రం దర్శకులు, నటీనటులు, గ్రూప్ థియేటర్ అధినేత చదలవాడ కృష్ణమూర్తి, సి.కృష్ణ, కుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి : సిపిఎం

నిరసన తెలుపుతున్న ఇంటి స్థలాలు లేని కరకంబాడీ పేదలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కరంబాడీ పంచాయతీ ఇంటిస్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కరకంబాడీ పంచాయతీలోని సర్వే నంబర్ 153/1లోని ప్రభుత్వ భూమిలో తాత్కాలిక గుడిసెలు వేసుకుని ఉన్న వారికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. జనవరి 26వ తేదీ నుంచి పేదలు ఇంటి స్థలాల కోసం నిరసన తెలుపుతున్నారని, వారికి ఇంటి పట్టాలు ఇచ్చారుకానీ, స్థలాలు చూపలేదని దీంతో కరకంబాడీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయమై పలు దఫాలు రెవెన్యూ అధికారులకు, జిల్లా అధికారులకు వినతులు, అర్జీలు అందించడం జరిగిందన్నారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో నేడు ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని పట్టాలు పొందిన వారికి కోసం కరకంబాడీ ఇళ్ల స్థలాల పోరాట కమిటీగా ఏర్పడి గుడిసెలు వేసినట్లు తెలిపారు. ఈనెల 1వ తేదీన రేణిగుంట తహాశీల్దారు, కమిటీ సభ్యులకు మధ్య చర్చలు జరిగాయని, జగనన్న పట్టాలున్న వారి నుంచి అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు. అలాగే ఆక్రమణదారుడైన సిద్ధుల రవిపై కేసు నమోదు చేస్తామని, భూమి ఆక్రమణకు ఉపయోగించిన హిటాచిని సీజ్ చేస్తామని తెలిపారని పేర్కొన్నారు. గతంలోనూ పలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమణదారులు బోగస్ పట్టాలు తయారు చేసి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని, ప్రస్తుతం రేణిగుంట ఎమ్మార్వో కార్యాలయం పక్కనే ఉన్న స్థలంలోనే ఇలా జరుగుతోందని విమర్శించారు. ఇకనైనా జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులు, తహాశీల్దార్ పేదల ఇంటి స్థలాల సమస్యపై స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు.

విజయవంతంగా బీసీ సింహగర్జన సభ

- బీసీల సభను చంద్రబాబు అడ్డుకునేందుకు కుట్ర చేశారు: అన్నా రామచంద్రయ్య
- బీసీల అభ్యున్నతే మా ధ్యేయం: వెంగళరావు
- బీసీలకు రక్షణ చట్టం తేవాలి: బీద మస్తాన్ రావు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బీసీలకు రాజ్యాధికారం దక్కేవరకు పార్టీలకతీతంగా బీసీ కులాలందరూ కూటమిగా ఏర్పడి సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆదివారం తిరుపతి ఇందిరా మైదానంలో బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర పోరాట రథయాత్ర ముగింపును ప్రజా సింహ గర్జన సభ పేరుతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిర్వహించింది. ఈ ప్రజా సింహ గర్జన సభకు వేలాదిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ గతేడాది డిసెంబర్ 7న శ్రీకాకుళం ఇచ్చాపురం నుండి చేపట్టిన మరో స్వతంత్ర పోరాట రథయాత్ర రాష్ట్రవ్యాప్తంగా 99 నియోజకవర్గాల్లో గ్రామ గ్రామాలకు రథయాత్ర వెళ్లి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియపరిచారు. దేశ జనాభాలో అత్యధికులుగా ఉన్న వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలు నేటికీ రాజ్యాధికారాన్ని పొందే అవకాశం లేకుండా నేటి పాలకులు నయవంచన రాజకీయాలకు తెరలు తీసి బీసీలలో చీలికలు తీసుకొచ్చారని, ఆ చర్యల నుండి బీసీ ప్రజలను మేల్కొలిపి బీసీలందరూ ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించుకోవడం కోసం పాటుపడాలనే లక్ష్యంతో ఈ రథయాత్ర కొనసాగిందన్నారు. 100వ నియోజవర్గం తిరుపతిలో మరో స్వాతంత్ర పోరాట రథయాత్ర ప్రజా సింహ గర్జన సభతో

సభకు హాజరైన ప్రజలు

అన్నా రామచంద్రయ్య

ముగింపు పలికామన్నారు. ఈ సింహగర్జన సభకు వేలాదిగా రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశ నలమూలల నుండి బీసీ ముఖ్య నాయకులు హాజరై బీసీలకు దక్కాల్సిన హక్కులను, ఐక్యంగా ఉంటే వచ్చే లాభాలను వివరించారు. బీసీలందరూ కులము కూటమిగా ఏర్పడి రాజ్యాధికారాన్ని సొంతం చేసుకోవడానికి నడుము బిగించాలన్నారు. బీసీల అభ్యున్నతి కోసం చేసే ఈ మహా యజ్ఞంలో ప్రతి ఒక్క బీసీ సోదరుడు కృత నిశ్చయంతో పని చేయాలన్నారు. బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అన్నా రామచంద్రయ్య మాట్లాడుతూ ఈ ప్రజా సింహ గర్జన సభకు బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలను రాకుండా చంద్రబాబు కుట్ర చేశారని అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించిన బీసీ

బీసీ సభకు హాజరైన ప్రముఖులు

సభకు బీసీ ప్రజలను రానివ్వకుండా అడ్డుకోవడం సిగ్గుచేటు అన్నారు. మా సీట్లు మాకిచ్చి ఓట్లు అడగాలని, సీట్లు ఇవ్వకపోతే అవకాశం ఉన్నచోట బీసీలు స్వతంత్రులుగా బరిలో దిగాలని పిలుపునిచ్చారు. 90 శాతం సీట్లు ఇచ్చే పార్టీకే మద్దతు తెలుపుతామని స్పష్టం చేశారు. గడిచిన ఎన్నికలలో చిత్తూరు జిల్లాలో 90 సీట్లు రావలసి ఉంటే కేవలం 12 మందికి మాత్రమే టికెట్లు కేటాయించడం బీసీల పట్ల రాజకీయ పార్టీలకు ఉన్న చిత్తశుద్ధి ఏంటో ఇట్టే తెలుస్తోందన్నారు. ఇకనైనా యావత్తు బీసీలు మేల్కొని బీసీల ఐక్యతకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ ఎమ్మెల్యే స్థానాలు కబ్జా అవుతున్నాయని, అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన వారే రాజ్యాధికారాన్ని అనుభవించడానికి బీసీల్లో చీలికతేస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ ఐక్యమత్యంగా ఉంటూ బీసీ లందరూ ఒక్క తాటిపైకి రావాలని, అప్పుడే దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు తగిన గుర్తింపు లభించి, రాజకీయంగా తగిన ప్రాధాన్యత లభిస్తుందన్నారు. సినీనటి కరాటే కళ్యాణి మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ ఐక్య పోరాటం దిశగా అడుగులు వేయాలన్నారు. రాజ్యాధికారం కోసం చేపట్టిన ఈ మహా సంకల్పంకి ప్రతి ఒక్క బీసీ నాయకుడు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు నాగ సత్యం, వెంకట్రావు, మురళీకృష్ణ, మస్తానమ్మ, బడి సుధా యాదవ్, శంకర్ యాదవ్, రఫీ, జగన్నాథం, తులసి యాదవ్, రమణ యాదవ్, పెద్ద సంఖ్యలో బిసి సామాజిక వర్గ ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

ఆదిమూలంని అవమానిస్తే సహించబోం

- పిచ్చాటూరులో దళిత నాయకుల నిరసన, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

నిరసన తెలియజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంని అవమానిస్తే సహించబోమని దళిత సంఘ నాయకులు హెచ్చరించారు. ఇటీవల ఎమ్మెల్యే దిష్టిబొమ్మను కాల్చిన సంఘటనపై వారు ఆదివారం పిచ్చాటూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన దిష్టిబొమ్మను తగలబెట్టడం యావత్ దళిత జాతికే అవమానంగా భావించాలన్నారు. కొంతమంది అగ్రకులాల వారి ప్రలోభాలకు లోనై అలా చేయడాన్ని ఖండించారు. ఆ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదైతే పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండేవని, ఇంత జరిగినా ఎమ్మెల్యే తమను సంయమనం పాటించాలని సూచించినట్లు తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ఎం.ఎస్ రవి ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాగరాజ్, రుకేష్, ఏకాంబరం, సైలేషన్, జాషువా, రమేష్, మేగవర్ణం సీమోన్, కుమరేష్ తదితరులు పాల్గొన్నారు.

మేత భూమికి దారి కల్పించండి

- గ్రామస్తులు నిరసన

ప్రజాశక్తి-ఓజిలి: మూగజీవాలు మేత కోసం వెళ్లడానికి దారి కల్పించాలని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దపరియ రాచపాలెం గ్రామ సర్వేనెంబర్ 239లో ఓ వ్యక్తికి అసైన్మెంట్ పట్టా ఇచ్చారు. ఇందులోనే జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టారు. అంతేకాకుండా సహజసిద్ధమైన పకృతి వనరులు కలిగి ఉన్నాయి. ఈ భూమికి అనుకొని సుమారు 50ఎకరాలు మేత పోరంబోకు భూములు ఉన్నాయి. రహదారి లేకుండా అక్కడి ఓ భూ యజమాని తన సరిహద్దు చుట్టూర పెన్సింగ్ వేసుండడంతో దారి లేకుండా పోవడమే కాకుండా పశువులకు మేత కరువవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల మేతకి రహదారి కల్పించాలని పలుసార్లు రెవెన్యూ అధికారులను విన్నవించారు. అయితే గ్రామస్తులు ఇచ్చిన అర్జీలను బుట్టదాకుల చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే భూములో జామాలు సాగు చేస్తుండగా గతంలో విధులు నిర్వహించిన తహశీల్దార్ అడ్డుకుని జామాలు సాగును తొలగించినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం ఈ సమస్యకు పరిష్కారం చెయ్యకపోవడంతో గ్రామస్తులు భూమి వద్ద నిరసనకు దిగారు. ఈ విషయంగా తహశీల్దార్ మాట్లాడుతూ సర్వే నెంబర్లు 239లో సుమారు నాలుగు ఎకరాల వరకు ఉందని ఇందులో సాహసం సిద్ధమైన వనరులు కలిగి ఉండడంతో రెండు ఎకరాల వరకు వదిలి తగినది సాగుదారులకు సాగు చేసుకోమని తెలియజేశామని తహశీల్దార్ శివరామ సుబ్బయ్య చెబుతున్నట్లు తెలిపారు.

చదువుకున్న కళాశాలపై మమకారం

- అభివృద్ధికి తోడ్పతున్న పూర్వ విద్యార్థి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: తాను చదువుకున్న కళాశాల ఆధునీకరణ, అభివృద్ధికి తోడ్పతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు పూర్వ విద్యార్థి వలసారెడ్డి శివప్రసాద్‌రెడ్డి. ఇప్పటికే కళాశాల ప్రాంగణంలో సుందీకరణ చేపట్టారు. ప్రస్తుతం మరో ఐదు నూతన తరగతులు నిర్మించేందుకు ముందుకొచ్చారు. పూర్వ విద్యార్థి ముందుకొచ్చి కళాశాల అభివృద్ధికి కృషి చేస్తుండడం అభినందనీయమని కళాశాల సీనియర్ అధ్యాపకురాలు జి.నాగరాణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనంపై కప్పును తొలగించి వాటి స్థానంలో జింక్ రేకులు వేయించి దాతృత్వం చాటుకున్నట్లు ఆమె తెలిపారు. తన తండ్రి మాజీ జెడ్పి చైర్మన్ వలసారెడ్డి సిద్ధరామిరెడ్డి పేరిట మరో ఐదు తరగతి గదులు నిర్మించేందుకు శివప్రసాద్‌రెడ్డి ముందుకు వచ్చారని పేర్కొన్నారు. ఆధునిక విద్యా బోధన అందించేందుకు అవి ఉపయోగపడతాయని వివరించారు. దాత శివప్రసాద్‌రెడ్డి దాతృత్వాన్ని పలువురు కొనయాడారు.


తరగతి గదుల నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న అధికారులు

సమాజంలోంచి మత్తును వదిలించండి

- రాష్ట్ర ఓబీసీ ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్
- ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): దేశానికి పట్టుకొమ్మలైన యువత పెడదారిన పడకుండా, సన్మార్గంలో నడవడానికి మత్తు పదార్థాలను పూర్తిగా నిషేధించాలని రాష్ట్ర ఓబిసి ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం చంద్రగిరిలో 'మత్తు పదార్థాలను నిషేధిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం' అనే నినాదంతో, 'ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం' సందర్భంగా మత్తు పదార్థాలు వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుమారు 10వేల మందితో శ్రీ ఉగ్రప్రత్యంగిర ఆలయం నుంచి టవర్‌క్లాక్ వరకు సాగిన ఈ ర్యాలీ అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో గంజాయి వాడకాల్లో ఏపీ ముందుంటే, గంజాయి అమ్మకాల్లో చంద్రగిరి ముందుందని ఆరోపించారు. పిల్లలు కూడా గంజాయి అమ్ముతుండటం బాధాకరం అన్నారు. బ్యానర్లు, పోస్టర్లు అంటూ స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి నియోజకవర్గంలో హడావుడి చేస్తారని, నిజంగా ప్రజల పట్ల ప్రేమ ఉంటే గంజాయి రహిత నియోజకవర్గం చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఒక్క కేసు నమోదు చేశారా అని నిలదీశారు. గంజాయి మత్తులో పట్టపగలు షాపుల్లో దూరి కొట్టడం, అడ్డువచ్చిన వారిని చితకబాదడం లాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుచానూరు కేంద్రంగా గంజాయి సరఫరా జరగడం వల్ల పచ్చని పల్లెలో కూడా విచ్చలవిడిగా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. ఇంతకు ముందు ప్యాకెట్‌లో అమ్మేవారు ఇప్పుడు ఏకంగా గంజాయి సిగరెట్లు, గంజాయి చాక్లెట్లు అమ్ముతూ విద్యార్థులు యువత జీవితాలతో ఆడుకోవడం మంచింది కాదన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-సత్యవేడు: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల ప్రాంగణంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యులు పరీక్షలు చేసి చికిత్స చేస్తారన్నారు. కంటి సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓజిలి ఎస్ఐగా రవిబాబు

ప్రజాశక్తి-ఓజిలి: ఓజిలి నూతన ఎస్ఐగా పి.రవిబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని శాంతిభద్రతల పర్యేషణకు కృషి చేస్తామన్నారు.

నేత్ర శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: మండలంలోని గోవర్ధనపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో డైనమిక్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంనకు సుమారు 70మంది ప్రజలు పాల్గొని చికిత్స చేయించుకున్నారు. కార్యక్రమంలో వెంకటముని, డాక్టర్ అరవింద్, సుబ్రమణ్యం, రామసుబ్బయ్య, గుణవర్ధన్, మోహన్‌రావు, గోపి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

'ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి'

ప్రజాశక్తి-గూడూరు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావు కోరారు. మండలం సిద్ధమ్మకండ్రిగ గ్రామంలో ఆదివారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, ఇంద్రవర్ధన్, అంకయ్య, కోటయ్య, పరశురామ్, కోటయ్య, శ్రీనాథ్, మాతయ్య, శ్రీనివాసులు, రాము, సురేష్, జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ నేత పుట్టినరోజు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: పట్టణానికి చెందిన వైసీపీ నేత హాషీమ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని కరణాల వీధిలోని వైసీపీ నేత శివకుమార్‌రెడ్డి నివాసంలో 'స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్మన్ పొనకా దేవసేనమ్మ, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజును నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కోదండరామయ్య, వాసు, అజీజ్ ఖాన్, ముని, సాయి, అహ్మద్ బాషా, అల్తాఫ్, విజయ్, చిన్నా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏసు మృతికి నివాళి

ప్రజాశక్తి-పిచ్చాటూరు: పిచ్చాటూరు దళితవాడకు చెందిన ఏసు(53) ఆరోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళులర్పించి వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హాలిమలో పనిచేస్తున్న యేసు కుటుంబానికి ప్రభుత్వ తరపున జిల్లా కలెక్టర్ ద్వారా న్యాయం చేస్తానని భరోసా కల్పించారు.

హైడ్రో జెల్ వినియోగంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-ఓజిలి: హైడ్రో జెల్ వినియోగంపై రైతులకు ఉద్యాన శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆతక్తి) అవగాహన కల్పించారు. ఆర్మేని పాడు రైతు భరోసా కేంద్రం వద్ద హైడ్రోజెల్ వినియోగంపై ప్రదర్శనా క్షేత్రం ఏర్పాటు చేసి రైతులకు వర్మీ కంపోస్ట్ ట్రైకోడెరా వీరిడి, హైడ్రిజిల్‌ను ఉచితంగా సరఫరా చేసి మొక్కలకు ఎలా వాడాలో అవగాహన కల్పించారు. దీని వలన మొక్కలకు తక్కువ నీటి తడులు అవసరం అవుతాయని, కరువు పరిస్థితులలో నీటి ఎద్దడిని మొక్కలు తట్టుకుంటాయని తెలిపారు. పి.డి సత్యవాణి, శివనారాయణ, శారద, వంశి పాల్గొన్నారు.

ప్రజా సేవకు అంకితమవుతా..: చెవిరెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): సంక్షేమం ప్రగతే లక్ష్యంగా.. సీఎం జగన్ ప్రభుత్వం సమర్థవంతంగా పరిపాలన సాగిస్తున్నదని తుడా చైర్మెన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కందులవారిపల్లి, రంగంపేట గ్రామాలలో విస్తృత పర్యటన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు సొంత పంచాయతీ కందులవారిపల్లిలో చేపట్టిన అభివృద్దే నియోజకవర్గ అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఎ.రంగంపేటలో మోహిత్ రెడ్డిని భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం వివిధ చోట్ల పార్టీ జెండా ఆవిష్కరణలు అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలే తన కుటుంబంగా భావించి సేవ చేస్తున్నారని మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసేవకు అంకితం అవుతానని తెలిపారు. వివిధ పంచాయతీలలో రూ.30లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పిటిసి యుగంధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మెన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు దేవారెడ్డి, నాగరాజు, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, మస్తాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 9న నిర్వహిస్తున్నట్లు పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి రాఘవేంద్ర పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజీ మార్గములో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనము ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు దానిపై అప్పీల్ ఉండదని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చును అని రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ప్రీ లిటిగేషన్ కేసులను (కోర్టు లో పెండింగ్ లేని కేసులు) రాజీ చేస్తారన్నారు. కచ్చిదారులు, న్యాయవాదులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అలరించిన శివ భజనలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయ సాంస్కృతిక కళావేదిక వద్ద జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శివ భజనలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అఖండ శివనామ సంకీర్తన కార్యక్రమం మూడు రోజులో భాగంగా ఆదివారం గూడూరు మండలం విడిచెర్ల గ్రామానికి చెందిన శ్రీరామ, సీతాలాంబ భజన బృందాలు పాల్గొన్నాయి. జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్ సంక్రాంతి వెంకటయ్య, కళాకారులు జెడ్డా సుధాకర్, పోలయ్య, రమణమ్మ, పుల్లయ్య, జయమ్మ, లక్ష్మీ, నరసయ్య, శీనయ్య, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగంలో మార్పులు ఆవశ్యకం'

ప్రజాశక్తి-క్యాంపస్: మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యారంగంలో మార్పులు ఆవశ్యకమని రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టిపల్లి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొండారెడ్డి రాయలసీమ యూనివర్సిటీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ (రిమ్స్)లో మూడు రోజులపాటు గ్యాబ్ ఫెస్ట్ 2024, టెక్నో నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత, విప్లవ, విద్యా రంగంలో మార్పులు ముఖ్యమని, అత్యవసరమని, సామాజిక సాంకేతిక రాజకీయ ఆర్థిక మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, ఈ టెక్నా గ్యాబ్ ఫెస్ట్ 2024 ఈ వెంట్స్‌లలో ఎర్రర్ డిటెక్షన్, పేపర్ ప్రెజెంటేషన్, క్విజ్, ప్రోగ్రామ్స్ డెవలప్మెంట్, యంగ్ మేనేజర్ మార్కెటింగ్ మంత్ర, బిజినెస్ ప్లాన్, డేటా అనాలసిస్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కొండారెడ్డి, ఆనందరెడ్డి, విజయరెడ్డి, డాక్టర్ నిరంజన్ రెడ్డి, ఎంసీఏ విభాగాధిపతి మధుర పాల్గొన్నారు.

మైదానాన్ని కాపాడుకుని తీరుతాం

- పూర్వ విద్యార్థులు, రాజకీయ పార్టీ నేతల ఆధ్వర్యంలో ధర్నా

మైదానం గేటు ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థి సంఘ నేతలు, పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీ హైస్కూల్ క్రీడా మైదానాన్ని కాపాడుకొని తీరుతామని పూర్వ విద్యార్థులు, వివధ రాజకీయ పార్టీ నేతలు తేల్చి చెప్పారు. ధర్నాకు పోలీసులు అడ్డుచెప్పడంతో మైదానం గేటు ముందే నిలబడి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 134ఏళ్ళ చరిత్ర కల్గిన క్రీడామైదానాన్ని కేవలం వసతిగృహం కోసం నిర్మించడం దారుణమని, ఎంతోమంది పేద క్రీడాకారులు ఈ మైదానంలోనే క్రీడలు అభ్యసించి ప్రస్తుతం ఉన్నత స్థితిలో ఉన్నట్లు గుర్తుచేశారు. యేళ్ళనాటి మైదానాన్ని వేరొక అవసరాల కోసం ఉపయోగించడం దారుణమని అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనను విరమించుకోకపోతే అన్ని విద్యార్థి సంఘాలతో, అన్ని రాజకీయ పార్టీలతో ఏకమై పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తరువాత క్రీడామైదానంలో నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమానికి నాయకులు విజయకుమార్, మునికృష్ణ, భానుప్రకాష్ రెడ్డి, భాస్కర్, వరప్రసాద్, కృష్ణప్రసాద్, హేమకుమార్, రాజమోహన్, నారాయణస్వామి, నగేష్, రాజేష్, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు దేశానికి ఉపయోగపడాలి'

ప్రజాశక్తి-రేణిగుంట: విద్యార్థులు భవిష్యత్తులో భారతదేశానికి ఉపయోగపడేలా తయారవ్వాలని తిరుపతి ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ బషీర్స్ తపస్య పాఠశాలలో లర్నింగ్ ఉత్సవ్‌ను ఆ పాఠశాల అధినేత విక్రమ్‌శాలి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొని ఉత్సవ్‌ను ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులు ప్రదర్శించిన ప్రయోగాత్మక పరికరాలు చాలా బాగున్నాయని అభినందించారు. భారతదేశానికి విద్యార్థులు భవిష్యత్తులో ఉపయోగపడే విధంగా తయారవ్వాలని అందుకు అనేక భాషలు నేర్చుకోవాలని సూచించారు. విక్రమ్ శాలి మాట్లాడుతూ 500మంది విద్యార్థులు 250ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచడం విశేషమని కొనియాడారు. చదువులో తమ పాఠశాల విద్యార్థులు ఎల్లప్పుడూ ముందు ఉంటారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల డైరెక్టర్ అనూషకు అభినందనలు తెలిపారు.

ధరలు పెంచడం దుర్మార్గం: గాలి భాను

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: వైసీపీ ప్రభుత్వం కరెంటు, విద్యుత్, డీజల్ ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులు పెట్టడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిందని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ విమర్శించారు. మున్సిపాలిటీలోని 19 వార్డులో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి మిని మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చెంచయ్య. జీవరత్నంనాయుడు. ధనపాల్, మాధవయ్య. యుగంధర్, గోపి, చిన్నబాబు, వేలు పాల్గొన్నారు.

కయ్యూరుకు సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పెన్నలపాడు ప్రాథమిక పాఠశాలలో పదేళ్ళు విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై దిగువ సాంబయ్యపాళెం పాఠశాలకి బదిలీపై వెళ్ళిన కయ్యూరు బాలసుబ్రమణ్యంను ఆదివారం పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు ఉన్నతికి బాలసుబ్రమణ్యం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అనంతరం శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఇన్నేళ్ళు తనపై ఆదరాభిమానాలు చూపించిన గ్రామస్థులకు, ఉపాధ్యాయులకు బాలసుబ్రమణ్యం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దినకర్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువ వైభవ సేవ ముత్యం అవార్డు అందుకున్న షేక్ అబ్దుల్ రజాక్

ప్రజాశక్తి-రేణిగుంట: సర్ సి.వి రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం 28వ సంవత్సర ఉగాది మహోత్సవ స్వర్ణ కంకణ అవార్డు సంబరాలను ఆదివారం ఎస్వీయూ ఆడిటోరియంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. రేణిగుంట ఎంఎ జబ్బార్ ట్రస్ట్ అధినేత డాక్టర్ షేక్ ఫరీద్ బాబా, సతీమణి సేవ పురస్కార అవార్డు గ్రహీత షేక్ హసీనాబాను, బుల్లి మనవడును తాత అడుగుజాడల్లో అడుగులు వేపిస్తూ గత కొద్ది నెలలుగా సేవలలో పాల్గొంటున్న షేక్ అబ్దుల్ రజాక్, (షేక్ ఏహాన్) కు ప్రత్యేక ఆహ్వానం అందించి డాక్టర్ షేక్ ఫరీద్ బాబాకు, సేవ వైభవ భూషణ్, షేక్ హసీనా భాను కు మహిళా సేవ శిరోమణి, మొట్టమొదటి సారి అవార్డు అందుకుంటున్న ముద్దుల మనవడు అబ్దుల్ రజాక్ (షేక్ ఏహాన్)కు యువ వైభవ సేవ ముత్యం అవార్డులను అత్యంత వైభవంగా పలువురు ముఖ్య విశిష్టత అతిధుల మహారాజులచే అందజేశారు.

మాజీ కౌన్సిలర్‌కు నోబెల్ వరల్డ్ రికార్డ్‌లో చోటు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి యోగ విభాగంలో నోబెల్ వరల్డ్ రికార్డ్ సృష్టించినట్లు వసంత యోగ అకాడమీ నిర్వాహకురాలు వసంతలక్ష్మి మీడియాకు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరానికి చెందిన తమ అకాడమీ ఆధ్వర్యంలో గత సంవత్సరం నవంబర్‌లో ఆన్లైన్లో నిర్వహించిన యోగా పోటీలలో పట్టణానికి చెందిన సంధ్యారాణి సూర్య నమస్కారాలు విభాగంలో నోబెల్ రికార్డు సాధించారని తెలిపారు. సూర్య నమస్కారాలు నాన్‌స్టాప్‌గా 108సార్లు అతి తక్కువ సమయంలో చేయడంతో ఆమె నోబెల్ వరల్డ్ రికార్డ్ సృష్టించినట్లు న్యూఢిల్లీకి చెందిన ఆ సంస్థ నిర్వాహకులు ప్రకటించారని తెలిపారు.

క్రైం కార్నర్

పందెం రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి-బాలాయపల్లి: కోడి పందెం రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వేటూరి బ్రహ్మానాయుడు తెలిపారు. ఆదివారం మండలంలోని కొత్తూరు రోడ్డు కోటంబేడు వద్ద స్థావరాలపై దాడులు చేశామన్నారు. 6కోళ్లు, 35 బైక్‌లు మరి కొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): అకుతోట వీదికి చెందిన డి.ధనమ్మ(80) చుట్టు గుడిసె ఆదివారం విద్యుత్ సార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి పూర్తిగా కాలిపోయింది. స్థానికులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన మంటలు అర్పటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. అయినప్పటికీ చుట్టు గుడెసె పూర్తిగా కాలిపోయింది నష్టం కలిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ధనమ్మకు చెందిన ఇంటి సామాన్లు బట్టలు పూర్తిగా కాలిపోయాయి. ధనమ్మ నాలుగిళ్లలో పాచి పనులు చేసుకుంటూ ఒంటరిగా ఆ గుడిసెలో జీవనం సాగిస్తుండేది. ఆసరాగా ఉండిన గుడిసె కాలిపోవటంతో ధనమ్మ వీధిపాలైంది. ప్రభుత్వం స్పందించి ధనమ్మను ఆదుకోవాలని పలువురు కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాపట్లకు చెందిన భార్గవ అనే వ్యక్తి మద్యం తరలిస్తున్న అందిన సమాచారంతో దాడి చేశామన్నారు. అతని నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.